క్లుప్తంగా

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా

మెళియాపుట్టి: గ్రామాల్లో పారిశుధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రతీరోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఇంటి పన్నులు వసూలు చేయాలని, పారిశుధ్య పనులు చేసి ఫొటోలు అప్లోడ్ చేయాలన్నారు. జనరల్ ఫండ్, 15 ఫైనాన్స్ నిధులు, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుపడాలని సూచించారు. వీధి దీపాలు, తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యదర్శులు, అప్పారావు, శివాజీ, ఎర్రయ్య, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు బాగు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలోని బోరును గురువారం బాగు చేసినట్లు సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు తెలిపారు. బోరు పాడవ్వడంతో సర్పంచ్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ బోరును బాగు చేయించారు. గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రోన్లతో అనేక ప్రయోజనాలు



అవగాహన కల్పిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

సరుబుజ్జిలి: డ్రోన్లు ద్వారా క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష తెలిపారు. డ్రోన్లు ద్వారా క్రిమిసంహారక మందులు పిచికారీ విధానంపై ఇస్కలపాలెం గ్రామంలో రైతులకు క్షేత్రస్థాయిలో గురువారం అవగాహన కల్పించారు. ఈ విధానంలో క్రిమిసంహారక మందు, నీరు, సమయం ఆదా అవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మత్స్య విభాగం నుంచి సి.హెచ్.బాలకృష్ణ, సేద్య విభాగం నుంచి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్సార్‌ఎఫ్ నిక్రా హేమలత, అగ్రికల్చర్ ఏడీ వెంకటరావు, ఏఓ బొడ్డేపల్లి పద్మనాభం, రైతులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మిక చింతన అవసరం



సత్యనారాయణ చిత్రపటాలతో ఆధ్యాత్మిక గురువు, తదితరులు

మెళియాపుట్టి: మానసిక ప్రశాంతత కోసం ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అనుసరించాలని బెంగుళూరు నుంచి వచ్చిన ఆధ్యాత్మిక గురువు రాజయోగి బి.కె.మంజునాథ్ అన్నారు. గురువారం చాపర గ్రామంలోని త్రిలోక్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దైనందిత జీవితంలో మానసికంగా, శారీరంగా పడుతున్న ఇబ్బందులకు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. దీనికి సంబంధించి ఆధ్యాత్మిక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడానికి, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన శ్రద్ధ, క్రమశిక్షణ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి 27వ తేదీన సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పలువురికి సత్యనారాయణ చిత్రపటాలను అందించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



రామచంద్రాపురం వద్ద రహదారి దుస్థితి

సరుబుజ్జిలి: ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. మండలంలోని రామచంద్రాపురం వద్ద రహదారిలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం నీరు చేరి చెరువును తలపిస్తోంది. కొత్తవారు వాహనాలతో వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పేరు మార్చి.. పక్కన పెట్టి!



బగదలో రీ సర్వే కోసం డ్రోన్ కెమెరా ఉపయోగిస్తున్న అధికారులు (ఫైల్)

- భూముల రీ సర్వేపై తొలగని సందిగ్ధం
- ఏపీ సర్వే ప్రాజెక్ట్‌గా పేరుమార్చిన కూటమి ప్రభుత్వం
- పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు
- క్రయ, విక్రయాలకు ఇబ్బంది పడుతున్న రైతులు



తెంబూరులో రైతులతో గ్రామ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

పాతపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతులుకు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. కూటమి సర్కార్ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి భూ సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన భూముల రీ సర్వే పథకాన్ని పక్కన పెట్టిన ఈ ప్రభుత్వం ఆ స్థానంలో ఏపీ సర్వే ప్రాజెక్ట్ అంటూ పేరు మార్చిందే తప్ప.. విధివిధానాలు వెల్లడించకపోవడం సందిగ్ధత నెలకొంది. క్రయ, విక్రయాలకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో జగనన్న భూ హక్కు... భూ రక్ష పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. ప్రభుత్వమే ఉచితంగా కొలతలు వేసి, హద్దులు చూపి భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అధునాతన పరికరం (రోవర్) సాయంతో బ్రిటిష్ కాలం నాటి హద్దులను అనుసంధానం చేసుకుని పొలాలను సర్వే చేశారు. రైతులకు రూపాయి ఖర్చు లేకుండా అన్నీ ప్రభుత్వమే భరించింది. ఈ మేరకు రీ సర్వే వేగంగా సాగింది కూడా. రీ సర్వే అనంతరం రైతులు ఏమైనా అభ్యంతరాలు చెబితే వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులను నియమించింది గత ప్రభుత్వం. ఏళ్ల తరబడి నెలకొన్న భూ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్న నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. రైతుల భూములను ప్రభుత్వం లాగేసుకుంటుందని అసత్య ఆరోపణలతో విస్తృతంగా ప్రచారం చేసిన కూటమి నేతలు సత్ఫలితాలే సాధించారు. అధికారం చేపట్టిన టీడీపీ సర్కార్ భూముల రీ సర్వేను పక్కన పెట్టడంతో పొలాల క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పాతపట్నం నియోజకవర్గంలో భూముల రీ సర్వే వివరాలు ఇలా..		
మండలం	రెవెన్యూ గ్రామాలు	సర్వే పూర్తి చేసిన రెవెన్యూ గ్రామాలు
పాతపట్నం	49	29
కొత్తూరు	36	28
మెళియాపుట్టి	70	22
హిరమండలం	40	18
ఎల్.ఎన్.పేట	47	39

136 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి..

పాతపట్నం నియోజకవర్గంలో 242 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. ఇందులో 136 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయింది. మిగిలిన 106 రెవెన్యూ గ్రామాల్లో ఈ పక్రియ ప్రారంభం కాలేదు. పాతపట్నం మండలంలో మొదట నల్లకొత్తూరు పైలెట్ గ్రామంగా ఎంపిక చేసుకుని భూముల రీ సర్వే పనులు ప్రారంభించారు. పొలం వద్దనే రైతులు లేవనెత్తిన సమస్యలను సర్వేయర్లు పరిష్కరించారు. ఇంకా కొన్నింటిని పరిష్కరించాల్సి ఉంది. భూములకు సర్వే నంబర్లకు బదులు ఎల్‌పీ నంబర్లు కేటాయించారు. రీ సర్వే నిలిచిపోవడంతో రైతులు విన్నవించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



ప్రస్తుతం ఏపీ సర్వే ప్రాజెక్టుకు సంబంధించి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో రీ సర్వే చేసిన తరువాత రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాం. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ కూడా చేశాం. నిబంధనల మేరకు అన్ని సమస్యలు పరిష్కరించాం. పాతపట్నం మండలంలో 29 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశాం. పొలాల విస్తీర్ణం, మొత్తం నంబర్లు, రీ సర్వే తర్వాత విస్తీర్ణం, ఎల్‌పీఎంఎస్‌లు, ఖాతాలు పరిశీలించి రైతుల అంగీకారంతో సరిహద్దు రాళ్లు పాతాం. ప్రస్తుతం రీ సర్వేకు సంబంధించి అర్జీలు వస్తున్నప్పటికీ అధికారుల నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– సునీల్ కుమార్, రీ సర్వే డీటీ, పాతపట్నం

● ఘన సత్కారం



వైఎస్సార్‌సీపీలో పార్టీ పదవులు పొంది ప్రమాణ స్వీకారం చేపట్టిన ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజును స్థానిక ఆహ్వాన కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. గురువారం నరసన్నపేట పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షునిగా కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ పరిశీలకునిగా సీతారాం, డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అప్పలరాజు ప్రమాణం చేశారు. వీరికి ఆహ్వాన కమిటీ తరపున జిల్లా నుంచి వచ్చిన పార్టీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలు మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

-నరసన్నపేట

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

హిరమండలం: స్థానిక పీహెచ్‌సీలో పీఎంఎంఎస్‌వైలో భాగంగా 63 మంది గర్భిణులకు వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. 12 మందిని హైరిస్క్ గర్భిణులగా గుర్తించారు. జెమ్స్ ఆస్పత్రికి చెందిన గైనకాలజిస్ట్ మృదుల, రేడియాలజిస్ట్ రమ్య ఆరోగ్య పరీక్షలు, స్కాన్‌లు చేశారు. గర్భిణులు ప్రత్యేకంగా తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. అవసరమైన వారందరకీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు సత్యసాయి సేవా సంస్థ ద్వారా భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతికి సంతాపం

ఎల్.ఎన్.పేట: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం రతన్ టాటా చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, నాయకులు అంపిలి పోలినాయుడు, రెడ్డి రామారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మరణం దేశానికి తీరనిలోటని జెడ్పీటీసీ సభ్యుడు పాగిరి బుచ్చిబాబు అన్నారు. రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు



పెద్దమల్లిపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రామారావు

పాతపట్నం: దసరాగా సందర్భంగా గ్రామాల్లో గొడవలు పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పాతపట్నం సీఐ ఎస్.రామారావు హెచ్చరించారు. మండలంలోని పెద్దమల్లిపురంలో గురువారం రాత్రి సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ దసరా సందర్భంగా గ్రామంలో ఎటువంటి తగదాలు రాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ బి.లావణ్య, పోలీసులు పాల్గొన్నారు.

పరామర్శ..



పాతపట్నం: శ్యామ్‌సుందరరావును పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మిర్యాబిల్లి శ్యామ్‌సుందరరావు ఇటీవల సర్జరీ చేసుకున్నారు. పాతపట్నంలోని బాలాజీనగర్‌లో గల అతని స్వగృహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ యరుకొల వెంకటరమణ, పార్టీ నాయకులు ఎనుగుతల సూర్యం, గేదెల సూర్యం, పార్వతీశం, పసుకు మోహన్, డి.జోగారావు, టంకాల సుధాకర్, జి.అప్పన్న, సాయి, జీవా పాల్గొన్నారు.

అంపిలి కుటుంబానికి..

కొత్తూరు: మండలంలోని గూనభద్ర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంపిలి బుచ్చిబాబు అత్త భారతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బుచ్చిబాబు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు కలమట రమేష్‌బాబు, కె.వైకుంఠావు, వడమ శ్రీనివాసరావు, నిమ్మగడ్డ కృష్ణారావు, వనుము లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సాహితీ సమావేశాన్ని జయప్రదం చేయండి

ఆమదాలవలస: పట్టణంలోని బీఆర్‌నగర్‌లో గల పొన్నాడ అప్పలనరసమ్మ–చిన్నవాడు గ్రంథాలయం పైన ఈ నెల 13 వ తేదీ ఉదయం 9 గంటలకు విశ్వ సాహితీ సమావేశం నిర్వహించనున్నారు. సాహితీ వేత్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని విశ్వ సాహితీ ప్రధాన కార్యదర్శి పాతిన వరహానరసింహం గురువారం ఒక ప్రకటనలో కోరారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి రావూరి భరద్వాజ వర్ధంతి సందర్భంగా సాహిత్యం–ఒక పరిశీలన అనే అంశంపై వక్తల ప్రసంగం, చర్చ, స్వీయ కవితా పఠనం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

ఐఆర్, పీఆర్సీ ప్రకటించాలి

నరసన్నపేట: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కనీసం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని నరసన్నపేట విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సదాశివుని ప్రభాకరరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా ఐఆర్‌ను, 12 శాతం పీఆర్సీని ప్రకటించాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పందించాలన్నారు.


బాధ్యతల స్వీకరణ



జేఈ రాజేశ్వరి

ఎల్.ఎన్.పేట: మండల గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం జేఈగా బి.రాజేశ్వరి గురువారం విధుల్లోకి చేరారు. పోలాకి మండలం నుంచి బదిలీపై ఎల్.ఎన్.పేట మండలానికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి పాలనలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించే జేఈ వచ్చారని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు.

ఈఓపీఆర్డీగా వెంకటరావు



పాతపట్నం: మండల పరిషత్ కార్యాలయం ఈఓపీఆర్డీగా ఎల్.వెంకటరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మన్యం జిల్లా అరకువాలీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈఓపీఆర్డీ టి.కృష్ణారావు పాలకొండకు బదిలీపై వెళ్లారు. ఈఓపీఆర్డీకి కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న తిరుపతిరావు, తదితరులు

పాతపట్నం: మండలంలోని స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో పడాల శ్రీనివాసరావు మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో 2024లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు పారితోషకం అందజేశారు. పాతపట్నం, సారవకోట, కొరసవాడ, చాపర, సీది ప్రభుత్వ పాఠశాలల్లో 2024లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు రూ.1,000, జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటర్డ్ వైస్ ప్రిన్సిపాల్ తూలుగు తిరుపతిరావు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటర్డ్ ఎంపీడీఓ చిరంజీవి, రిటైర్డ్ ఎంఈఓ దాసునాయుడు, సారవకోట ఎంఈఓ వెంకటరమణ, జి.రాజేశ్వరావు, ఎం.తాతయ్య, పారశెల్లి రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల భజనలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు దుర్గాదేవిని దర్శించుకున్నారు.

-సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: శ్రీముఖలింగంలో దుర్గాదేవిగా పూజలు అందుకుంటున్న వారాహి అమ్మవారు



హిరమండలం: దుర్గాదేవిగా దర్శమిచ్చిన పెద్దకోరాడలోని పాతపట్నం నీలమణిదుర్గమ్మ



పొందూరు: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి అవతారం



నరసన్నపేట: పోతయ్యవలసలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



ఆమదాలవలస: మెట్టక్కివలసలో మహిళల కోలాటం



నరసన్నపేట: ఉర్లాంలో శాకంబరీ దేవిగా దుర్గామాత



సారవకోట: కుంకుమార్చనలలో పాల్గొన్న మహిళలు

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్.ఎన్.పేట: రాజకీయాలతో పనిలేకుండా గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రాధాన్యత ఇవ్వాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికార పార్టీ, ప్రతిపక్షం అంటూ ఎవరూ ఉండకూడదన్నారు. అందరం ప్రజల కోసం పనిచేయాలన్నారు. అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల వద్దకు ఎవరు ఏ పని కోసం వచ్చినా.. ఆ పని చేసి పెట్టాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. మండలంలో విద్యుత్, పీఆర్ తదితర శాఖలకు పూర్తిస్థాయిలో పనిచేసేందుకు ఏఈలు లేక అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా శాఖలకు ఏఈలను నియమించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి పంచాయతీల్లో పనిచేసిన వేతనదారులకు చెల్లించిన వేతనాల్లో 40 శాతం మెటీరియల్ నిధులు పంచాయతీలు యూనిట్‌గా తీసుకుని ఆయా పంచాయతీలకు కేటాయించాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. పీఆర్ శాఖ మంత్రి ఇప్పటికే పంచాయతీల అభివృద్ధిని నిధులు ఇచ్చారని ఎమ్మెల్యే అన్నారు. జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, వైద్యులు ఎస్.సునీత, ఎ.లక్ష్మీదీప్, పశువైద్యాధికారి జి.కవిత, ఏఓ పైడి లతశ్రీ, ఏపీఓ వి.శ్రీదేవి, ఎంఈఓ చంద్రమౌళి, ఐసీడీఎస్ సీడీపీఓ విమలారాణి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



నరసన్నపేట: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

నరసన్నపేట: విద్యుత్ డిమాండ్‌ను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్‌లను ప్రోత్సహిస్తుందని విద్యుత్ శాఖ డీఈ కె. ఇందిర అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం వినియోగదారులకు ప్రధాన మంత్రి సూర్య ఘర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోలార్ రూఫ్ టాప్‌లకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ కోటేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజినీర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పాతపట్నం విద్యుత్ శాఖ ఏడీ జీవీఎస్ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని శుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పథకం పోస్టర్‌ను విడుదల ఛేశారు. ఏఈ వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరు: సౌర విద్యుత్‌తో డబ్బులు ఆదా చేసుకోవచ్చనని, సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోటబొమ్మాళి డీఈఈ కె.విష్ణుమూర్తి అన్నారు. గురువారం చల్లవానిపేటలో సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే రాయితీని పొందాలన్నారు. చల్లవానిపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, ఏఈ వి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణా డీఎస్సీలో సత్తాచాటిన కొర్లకోట యువతి



పేడాడ హిమశ్రీ

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట గ్రామానికి చెందిన పేడాడ హిమశ్రీ తెలంగాణ రాష్ట్రం నిర్వహించిన డీఎస్సీలో 9వ ర్యాంకు సాధించి ఎస్టీటీగా ఎంపికైంది. ఈమె తండ్రి ప్రభాకరరావు సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి గృహిణి. హిమశ్రీ ఎంపికపట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.